# లక్ష మెజార్టీతో గెలుస్తా..

- ఎక్సైజ్‌శాఖ మంత్రి డా. శ్రీనివాస్‌గౌడ్
- పాలకొండ నుంచి ప్రారంభమైన ప్రచారం



పాల్‌కొండలో ఇంటింటి ప్రచారంలో భాగంగా కూరగాయలు విక్రయిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్



షాసాబ్‌గుట్ట దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్‌టౌన్, అక్టోబర్ 25: మహబూబ్‌నగర్ నియోజకవర్గం నుంచి రాబోయే ఎన్నికల్లో ప్రజల ఆశీర్వాదంతో లక్ష ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధిస్తామని రాష్ట్ర అబ్కారీ, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం పాలకొండలోని ఆంజనేయస్వామి ఆలయం, షాసాబ్‌గుట్ట దర్గా, కల్వరి ఎంబీ చర్చిలో కుటుంబ సమేతంగా హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్ రెవరెండ్ వరప్రసాద్, షాసాబ్‌గుట్ట దర్గా పీఠాధిపతి సయ్యద్ అబ్దుల్‌రజాక్‌షా ఖాద్రీ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనల అనంతరం మంత్రిని ఆశీర్వాదించారు. మహబూబ్‌నగర్ నియోజవర్గ అభివృద్ధి వివరిస్తూ మంత్రి కుటుంబ సమేతంగా పాల్‌కొండలో ఇంటింటి ప్రచారం ప్రారంభించారు. పాలకొండ చౌరస్తాలో ప్రచార రథం నుంచి మంత్రి ప్రసగించారు. గతంలో తాగునీటి కోసం మహబూబ్‌నగర్ ప్రజలు ఇబ్బందులు పడ్డారని, నేడు స్వరాష్ట్రంలో అత్యంత అభివృద్ధి చెందిన నియోజకవర్గంలో మహబూబ్‌నగర్ ఒకటి అన్నారు. పేదలకు ఎక్కడైతే కష్టం నష్టం జరుగుతుందో అక్కడ తాను ఉంటానని మంత్రి తెలిపారు. పాలకొండ ఒకప్పుడు మున్సిపాలిటీలోని మారుమూల గ్రామంగా ఉండేదని ఇప్పుడు మున్సిపాలిటీ పరిధిలోకి రావడమే కాకుండా సమీపంలోని అతి పెద్ద బైపాస్‌రోడ్డు, సెంట్రల్ లైటింగ్ వచ్చాయన్నారు. రాష్ట్రంలో మొట్టమొదటి మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల, పారామెడికల్ కళాశాల తీసుకొచ్చామన్నారు. ఐటీ ద్వారా సాఫ్ట్‌వేర్ కొలువులు, లిథియం గిగా పరిశ్రమల ద్వారా పదివేల ఉద్యోగాలు, ఫుడ్‌పార్క్ ద్వారా వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల జీవో తీసుకొచ్చామని త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన మ్యానిఫెస్టోలోని ప్రధానాంశాలైన దివ్యాంగులకు రూ.6,016, ఆసరా రూ.5,016, సన్న బియ్యం, పేదమహిళలకు నెలకు రూ.3వేల జీవనభృతి, ప్రతికుటుంబానికి రూ.5లక్షల జీవిత బీమా, రూ.400కే సిలిండర్, ప్రతిఇంటికీ సన్నబియ్యం తదితర పథకాలు కచ్చితంగా అమలు చేసి తీరుతామన్నారు. సీఎం కేసీఆర్ సహకారంతో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తిచేసి ప్రతి ఎకరానికి తాగునీరు అందిస్తామని తెలిపారు. మహబూబ్‌నగర్‌ను అన్నివిధాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని ప్రజలంతా సహకరించి ఎన్నికల్లో అఖండ విజయం సాధించేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో మంత్రి సతీమణి శారద, కుటుంబ సభ్యులు, మాజీ మున్సిపల్ చైర్మన్ ముత్యాల ప్రకాశ్, వార్డు కౌన్సిలర్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



ముత్యాలప్రకాశ్‌కు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్

## అభివృద్ధిని చూసే బీఆర్ఎస్‌లోకి వచ్చా..

- మున్సిపల్ మాజీ చైర్మన్, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు ముత్యాల ప్రకాశ్
- గులాబీ కండువా కప్పి ఆహ్వానించిన మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్/మహబూబ్‌నగర్ అర్బన్/పాలమూరు, అక్టోబర్ 25: ప్రజలకు మంచి చేయాలనే తపనతోనే దశాబ్దాల కాలం నుంచి రాజకీయాల్లో ఉంటూ వచ్చాను. కనీవినీ ఎరుగని రీతిలో మహబూబ్‌నగర్ దశదిశలా అభివృద్ధి జరిగింది. గింత అభివృద్ధి జరుగుతున్న ఆ పార్టీలో ఉండి ఏం చేస్తామని, మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కృషిచూసి బీఆర్ఎస్‌లో చేరుతున్నానని మాజీ మున్సిపల్ చైర్మన్, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు ముత్యాలప్రకాశ్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లో బుధవారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ఐటీశాఖ మంత్రి కేటీఆర్ సమక్షంలో ముత్యాల ప్రకాశ్ బీఆర్ఎస్‌లో చేశారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముత్యాల ప్రకాశ్‌కు సముచిత స్థానం కల్పించడంతోపాటు ఆయన సేవలను పార్టీ ఉపయోగించుకుంటుందని మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు.



హున్యానాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

## బీఆర్ఎస్ సర్పంచ్ భర్తకు ఎమ్మెల్సీ కవిత నివాళి

బాలానగర్, అక్టోబర్ 25: మండలంలోని తిరుమలగిరి సర్పంచ్ క్లేసీబాయి భర్త హున్యనాయక్ ఇటీవల మృతిచెందాడు. బుధవారం నిర్వహించిన దశదినకర్మ కార్యక్రమానికి ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి హాజరై మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సింగిరేణి ఫైనాన్స్ డైరెక్టర్, ఐఆర్ఎస్ బలరారం నాయక్, పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్‌నేత, వికారాబాద్ కలెక్టర్ నారాయణ్‌రెడ్డి, టీజీసీసీ చైర్మన్ వాల్యానాయక్, డీసీఎంఎస్ చైర్మన్ పట్ల ప్రభాకర్‌రెడ్డి, గిరిజన రాష్ట్ర నాయకుడు లక్ష్మణ్‌నాయక్, వైస్ ఎంపీపీ వెంకటాచారి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాసరావు, రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ రజిని, సర్పంచుల సంఘం మండలాధ్యక్షుడు తిరుపతినాయక్, బీఆర్ఎస్ నాయకులు జగన్‌నాయక్, శ్రీదర్‌గౌడ్, రాజాపూర్, బాలానగర్ మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతికార్యకర్తకూ గుర్తింపు

- ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేయాలి
- ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులతో జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జడ్చర్లటౌన్, అక్టోబర్ 25: పార్టీ అభ్యున్నతి కోసం పనిచేసే ప్రతికార్యకర్తను పార్టీ గుర్తిస్తోందని, రానున్న 35రోజులు చాలా కీలకమన్నారు. వచ్చే ఎన్నికల్లో లక్ష మెజార్టీ సాధించే దిశగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. మున్సిపాలిటీలోని నిమ్మబావిగడ్డ ప్రాంతానికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. యూత్ కాంగ్రెస్ నాయకులు సరాఫ్‌అలీ, నవీద్, ఆరీఫ్‌తోపాటు 120 మంది కాంగ్రెస్ కార్యకర్తలు గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారందరికీ ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. 9ఏండ్లలో జడ్చర్లను అభివృద్ధి పథంలో తీసుకెళ్లిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి వెంట పనిచేసేందుకు కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరుతున్నామని, హ్యాట్రిక్ విజయంలో పాలుపంచుకుంటామని పార్టీలో కొత్తగా చేరిన నాయకులు తెలిపారు.

# మ్యానిఫెస్టోతో ప్రతిపక్షాలకుమైండ్‌బ్లాంక్

- పేదలు, మహిళలకు పెద్దపీట
- ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

ఆత్మకూరు, అక్టోబర్ 25: బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ విడుదల చేసిన మ్యానిఫెస్టోతో ప్రతిపక్షాలకు మైండ్‌బ్లాంక్ అయ్యిందని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణం సమీపంలో ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఆదాయం పెంచాలి, పేదలకు పంచాలనే విధానంతోనే తొమ్మిదిన్నరేండ్లుగా పాలన సాగిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే నెంబర్‌వన్‌గా నిలిచిందన్నారు. మన నిధులు మనకే అనే నినాదాన్ని పూర్తిస్థాయిలో అమలు చేస్తూ రాష్ట్రంలోని ప్రతిపల్లె, బస్తీని సమగ్రంగా అభివృద్ధి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది కారేనని.. మూడోసారి ముఖ్యమంత్రి కేసీఆర్ సారేనని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ పథకాల లబ్ధి పొందని కుటుంబం అంటూ లేదని, వారి ఆశీర్వాదాలే మరోసారి బీఆర్ఎస్ పార్టీకి గెలుపునందిస్తాయన్నారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, బూత్ కమిటీ ప్రతినిధులు, అనుబంధ కమిటీల ప్రతినిధులు గడపగడపనూ తట్టి ప్రభుత్వ, సంక్షేమ పథకాలను వివరించి కారు గుర్తుకు ఓటేసేందుకు కృషిచేయాలన్నారు. కార్యకర్తలు సైనికుల్లా శ్రమించి పార్టీ విజయానికి పాటుపడాలని పిలుపునిచ్చారు. రెండుమూడు రోజుల్లో మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా వచ్చేనెల 6న సీఎం కేసీఆర్ మక్తల్‌కు రానున్నారని చెప్పారు. ఉదయం 10గంటలకు నిర్వహించే సీఎం కేసీఆర్ సభకు ప్రతి గ్రామం నుంచి భారీ ఎత్తున ప్రజలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి ఆంజనేయగౌడ్, ఎంపీపీ శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ కోటేశ్వర్, పీఏసీసీఎస్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గాయిత్రీయాదవ్, వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీధర్‌గౌడ్, సర్పంచులు, ప్రాదేశిక సభ్యులు, ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, బూత్‌కమిటీ ప్రతినిధులు, అనుబంధ కమిటీల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

# గడపగడపకూ సంక్షేమ పథకాలు

- పేట ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి
- ధన్వాడ, మరికల్‌లో ఎన్నికల ప్రచారం

మరికల్, అక్టోబర్ 25: బీఆర్ఎస్ హయాంలో గడపగడపూ సంక్షేమ పథకాలు అందాయని, మరికల్ మండలంలో ఎంతో అభివృద్ధి చేశామని, అభివృద్ధిని చూసి మరోసారి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి పరుస్తానని నారాయణపేట ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పుసల్‌పాడ్, రాకొండ, పెద్దచింతకుంట, వెంకటాపూర్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. రాబోవు ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల సమయంలో మాయ మాటలు చెప్పి ప్రజలను మోసం చేస్తాయని, అలాంటి వారిపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అంతకుమందు గ్రామాల్లో ఎమ్మెల్యేకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ సురేఖారెడ్డి, ఎంపీపీ శ్రీకళారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌కు ఓటేస్తే కటిక చీకటి

ధన్వాడ, అక్టోబర్ 25: నారాయణపేట ఎమ్మెల్యేగా తిరిగి గెలిపిస్తే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ద్వారా ఈ ప్రాంతానికి సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చీకర్లగడ్డతండా, చర్లపల్లి, హన్మన్‌పల్లిలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎస్.ఆర్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ సారథ్యంలోని బీఆర్ఎస్ ప్రభుత్వానికి హ్యాట్రిక్ విజయాన్ని ఇవ్వాలని ప్రజలకు కోరారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే తిరిగి చీకటి రోజులు వస్తాయని హెచ్చరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ విమాలాదేవి, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు వాహిద్, పార్టీ మండలాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, చంద్రశేఖర్, మురళీధర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, నాగిరెడ్డి, వెంకటయ్య, అంజియాదవ్, సర్పంచులు నారాయణరెడ్డి, రాజునాయక్, గోవింద్‌నాయక్, రాములు, పూర్యానాయక్, సచిన్, సునిల్‌రెడ్డి, మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.



మరికల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎస్.ఆర్ రెడ్డి